మందగించిన మౌలికం

జనవరిలో 15 నెలల కనిష్ఠానికి పతనం • 3.6 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: దేశంలో మౌలిక రంగాల వృద్ధి నెమ్మదించింది. జనవరిలో 15 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 8 కీలక రంగాల వృద్ధిరేటు 3.6 శాతంగానే నమోదైంది. రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు తదితర రంగాల్లో పనితీరు పేలవంగా ఉండటమే ఇందుకు కారణమని గురువారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు తదితర 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు గత ఏడాది డిసెంబర్‌లో 4.9 శాతంగా ఉన్నది. నిరుడు జనవరిలోనైతే ఇది 9.7 శాతం. ఇదిలావుంటే 2022 అక్టోబర్‌లో 0.9 శాతంగా ఈ 8 కీలక రంగాల వృద్ధిరేటు నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి కనిష్ఠానికి దిగజారింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-జనవరిలో కీలక రంగాల వృద్ధిరేటు 7.7 శాతంగా ఉన్నది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే వ్యవధిలో 8.3 శాతంగా ఉన్నది.

ప్రతికూలతలోకి..

రిఫైనరీ, ఎరువుల రంగాల్లో ఉత్పాదక వృద్ధిరేటు జనవరిలో ప్రతికూలంగా నమోదైంది. అయితే ముడిచమురు, సహజ వాయువు, సిమెంట్ రంగాల్లో ఉత్పత్తి వృద్ధి దాయకంగా ఉన్నది. బొగ్గు, ఉక్కు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత సైతం నిరాశాజనకంగానే కనిపిస్తున్నది. ఇక ఈ 8 కీలక రంగాల వాటా.. దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40.27 శాతంగా ఉంటున్నది.

మెడ్‌ట్రానిక్ అతిపెద్ద పరిశోధన కేంద్రం

2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు

మెడ్‌ట్రానిక్ సంస్థ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కంపెనీ సీఈవో జియోఫ్ మార్థా

హైదరాబాద్, ఫిబ్రవరి 29: ఐర్లాండ్‌కు చెందిన మెడికల్ టెక్నాలజీ సేవల సంస్థ మెడ్‌ట్రానిక్..హైదరాబాద్‌లో తాజాగా ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను నెలకొల్పింది. 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. అమెరికా బయట సంస్థకు ఇదే అతిపెద్ద రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సెంటర్ కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్, సీఈవో జియోఫ్ మార్థా మాట్లాడుతూ..వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగానే ఇక్కడ ఆర్ అండ్ డీ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు. వచ్చే ఐదేండ్లలో రూ.3 వేల కోట్లు(350 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇటీవల ప్రకటించిన సంస్థ..దీంట్లో భాగంగానే ఆర్ అండ్ డీని మరింత విస్తరించింది. అలాగే ఉద్యోగుల సంఖ్యను 1,500కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. అంతర్జాతీయ ఉత్పత్తుల అభివృద్ధిలో తమ ఆర్‌అండ్‌టీ టీం కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రాంతీయ ఇన్నోవేషన్ ఎకోసిస్టాన్ని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా రోగులకు మెరుగైన సేవలు నేరుగా అందించడానికి వీలు పడనున్నదని, హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగంలో మరో ముందడుగు పడినట్లు అవుతున్నదన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ దిగ్గజమైన ఎంఈఐ..2011లో హైదరాబాద్‌లో అడుగుపెట్టింది.

నేటి నుంచి ఆజియో ఆల్ స్టార్స్ సేల్స్

బెంగళూరు, ఫిబ్రవరి 29: దేశీయ ఫ్యాషన్ దిగ్గజాల్లో ఒకటైన ఆజియో..సరికొత్తగా ఆల్ స్టార్స్ సేల్‌ను ప్రకటించింది. మార్చి 1న ప్రారంభమైన ఈ ప్రత్యేక ఆఫర్ కింద 6 వేలకు పైగా బ్రాండ్స్‌ను 50 శాతం నుంచి 90 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. ఈ విక్రయ సమయంలో ఉత్తమంగా షాపింగ్ చేసిన వారిలో ప్రతి ఎనిమిది గంటలకు రూ.1,09,900 విలువైన ఐఫోన్ 15(512 జీబీ), రూ.1,49,900 ధర కలిగిన యాపిల్ మ్యాక్‌బుక్, రూ.1,61,999 విలువైన సామ్‌సంగ్ ఎస్ 23 అల్ట్రా 512 జీబీ సామర్థ్యం కలిగిన మొబైల్‌ను గెలుచుకునే అవకాశాన్ని కల్పించినట్లు కంపెనీ సీఈవో వినీత్ నాయర్ తెలిపారు. దీంతోపాటు ఐసీఐసీఐ క్రెడిట్, డెబిట్ కార్డుతో కొనుగోళ్లు జరిపిన వారికి 10 శాతం వరకు మినహాయింపు పొందవచ్చును కూడా. సంవత్సరంలో అతిపెద్ద సేల్‌కు శ్రీకారంచుట్టినట్టు, ఇటీవల కొత్తగా 500 బ్రాండ్స్‌ను చేరినట్లు తెలిపారు.

రూ.11 లక్షల కోట్లకు

ద్రవ్యలోటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ఈ ఆర్థిక సంవత్సరం జనవరి చివరినాటికి కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.11 లక్షల కోట్లకు చేరింది. సవరించిన వార్షిక బడ్జెట్లో పూర్తి సంవత్సరపు రూ.17.35 లక్షల కోట్ల (జీడీపీలో 5.8 శాతం) లక్ష్యంలో ఇది 63.6 శాతం. ప్రభుత్వానికి అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. గత 2022-23 ఆర్థిక సంవత్సరంలో జనవరిచివరికల్లా ఇది 67.8 శాతం ఉన్నది. గురువారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం 2024 జనవరి చివరినాటికి ప్రభుత్వపు మొత్తం వసూళ్లు రూ.22.52 కోట్లు. ఇందులో రూ.18.8 లక్షల కోట్ల పన్ను ఆదాయం, రూ.3.38 లక్షల కోట్ల పన్నుయేతర ఆదాయం, రూ.34,219 కోట్ల రుణేతర మూలధన వసూళ్లు ఉన్నాయి. మొత్తం వ్యయం రూ.33.54 కోట్లుకాగా, ఇందులో రూ.26.33 కోట్లు రెవిన్యూ అకౌంట్ ద్వారా, రూ.7.2 లక్షల కోట్లు క్యాపిటల్ అకౌంట్ ద్వారా వచ్చింది.

రూ.293.90 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ

ప్రస్తుత 2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాల్ని ఎన్ఎస్ఎస్ 7 శాతం నుంచి 7.6 శాతానికి పెంచింది. ఇది 2011-12 స్థిర ధరల ప్రకారం రూ.172.90 లక్షల కోట్లు. 2022-23 సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం వాస్తవ జీడీపీ రూ.160.71 లక్షల కోట్లు. ఈ అంచనా గణాంకాలకు అనుగుణంగా 2023-24లో వృద్ధి 7.6 శాతం పెరుగుతున్నట్టవుతుందని ఎన్ఎస్ఎస్ఓ వివరించింది. 2022-23లో ఇది 7 శాతంగా ఉంది. ఇక ప్రస్తుత ధరల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ రూ.293.90 లక్షల కోట్లకు చేరుతుందని ఎన్ఎస్ఎస్ఓ అంచనా వేసింది. 2022-23లో ఇది రూ.269.50 లక్షల కోట్లుగా ఉంది. ఈ ధరల ప్రకారం జీడీపీ 9.1 శాతం వృద్ధి రేటును ప్రదర్శిస్తుంది. క్యూ 3లో స్థిర ధరల (2011-12) మేరకు జీడీపీ రూ.43.72 లక్షల కోట్లుకాగా, 2022-23 అక్టోబర్-డిసెంబర్‌లో నమోదైన 40.35 లక్షల కోట్లతో పోలిస్తే 8.4 శాతం వృద్ధి నమోదైనట్టు. ప్రస్తుత ధరల ప్రకారం క్యూ3 జీడీపీ రూ.75.49 లక్షల కోట్లు కాగా, 2022-23 క్యూ3లో నమోదైన రూ.68.58 లక్షల కోట్ల కంటే ఇది 10.1 శాతం అధికం.

అంచనాలను మించిన జీడీపీ

మూడో త్రైమాసికంలో 8.4 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికంలో భారత్ ఆర్థికాభివృద్ధి అందరి అంచనాల్ని మించిపోయింది. గురువారం నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) 8.4 శాతం వృద్ధిచెందింది. తయారీ రంగం రెండంకెల్లో వృద్ధిచెందడం, మైనింగ్, నిర్మాణ రంగాలు మంచి పనితీరును కనపర్చడంతో ఈ వృద్ధి రేటు సాధ్యపడింది. ఇదే కాలంలో జీడీపీ 6.5 శాతం వృద్ధిచెందవచ్చని స్వయానా రిజర్వ్‌బ్యాంక్ గత అంచనాల్లో ప్రకటించగా, వివిధ ఆర్థిక నిపుణులు, రేటింగ్ ఏజెన్సీలు ఈ వృద్ధి 6-7.2 శాతం మధ్య ఉంటుందని అంచనాల్ని వెల్లడించారు. అంతకు ముందు జూలై-సెప్టెంబర్‌లో (క్యూ2) వృద్ధిని 7.6 శాతం నుంచి 8.1 శాతానికి, ఏప్రిల్-జూన్ (క్యూ1)లో వృద్ధి రేటును 7.8 శాతం నుంచి 8.2 శాతానికి తాజాగా ఎన్ఎస్ఓ సవరించింది. తయారీ రంగం మందగించడం, వినియోగంతగ్గడంవల్ల క్యూ3లో ఆర్థికాభివృద్ధి రేటు 7 శాతంలోపునకు పడిపోతుందని రాయిటర్స్ సర్వేలో విశ్లేషకులు అభిప్రాయపడగా, అందుకు భిన్నమైన గణాంకాలు వెలువడటం గమనార్హం.

వివిధ రంగాల వృద్ధి (శాతంలో)

	2023-24 క్యూ3	2023-24 క్యూ2	2022-23 క్యూ3
తయారీ	11.6	14.4	-4.8
వ్యవసాయం	-0.8	1.6	5.2
మైనింగ్	7.5	11.1	1.4
విద్యుత్, గ్యాస్, ఇతర వినిమయాలు	9	10.5	8.7
నిర్మాణం	9.5	13.5	9.5
ట్రేడ్, హోటళ్లు రవాణా, కమ్యూనికేషన్	6.7	4.5	9.2
రియల్ ఎస్టేట్, ఫైనాన్షియల్ సర్వీసులు	7	-	7.7

మోడ్‌మెడ్ తొలి జీసీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 29: అమెరికాకు చెందిన టెక్నాలజీ సంస్థ మోడ్‌మెడ్...హైదరాబాద్‌లో తన తొలి గ్లోబల్ కెపబిలిటీ సెంటర్(జీసీసీ)ను ప్రారంభించింది. మెడికల్ స్పెషాల్టీ సేవలను అన్నింటిని ఒక్కతాటిపైకి తేవడంలో భాగంగా 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను గురువారం ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 100 మంది ఉద్యోగులుండగా ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యని 200కి పెంచుకోనున్నట్లు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో డానియల్ కేన్ తెలిపారు.

30 కోట్లతో ఎంటీఆర్ యూనిట్

హైదరాబాద్, ఫిబ్రవరి 29: ప్రముఖ పప్పుదినుసుల సంస్థ ఎంటీఆర్..తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గడిచిన మూడేండ్లలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో రూ.100 కోట్ల వరకు పెట్టుబడిపెట్టిన సంస్థ..తాజాగా తన వ్యాపార విస్తరణలో భాగంగా గుంటూరులో రూ.30 కోట్లతో సరికొత్త యూనిట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సీఈవో సునయ్ భాసిన్ తెలిపారు. సంస్థ ఆదాయంలో తెలుగు రాష్ట్రాల నుంచి అధికంగా సమకూరుతుండటంతో ఇక్కడి మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

స్నోఫ్లేక్ సీఈవోగా భారత సంతతి వ్యక్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: మరో అంతర్జాతీయ సంస్థకు భారత సంతతి వ్యక్తి నాయకత్వం వహించబోతున్నారు. అమెరికా కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న స్నోఫ్లేక్ నూతన సీఈవోగా శ్రీధర్ రామస్వామి నియమితులయ్యారు. ఈ నియామకం వెంటనే అమలులోకి వస్తున్నట్లు పేర్కొంది. యూఎస్‌కు చెందిన క్లౌడ్ కంప్యూటింగ్ సంస్థకు సీఈవోగా వ్యవహరిస్తున్న ఫ్రాంక్ స్లూట్‌మ్యాన్ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ..సంస్థను మరో ఉన్నత శిఖరాలకు చేర్చడానికి తనవంతు కృషి చేయనున్నట్లు ప్రకటించారు. రామస్వామి గతంలో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించారు.

ఎఫ్‌డీఐలు తగ్గాయ్..

గత ఏడాది ఏప్రిల్ -డిసెంబర్‌లో 13 శాతం పతనం

32.03 బిలియన్ డాలర్లకే పరిమితం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్‌లో 13 శాతం క్షీణించి 32.03 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అంతకుముందు ఏడాది (2022) ఇదే వ్యవధిలో 36.74 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. అయితే 2023 అక్టోబర్-డిసెంబర్‌లో ఎఫ్‌డీఐ గతంతో పోల్చితే 18 శాతం పెరిగి 11.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 అక్టోబర్-డిసెంబర్‌లో 9.83 బిలియన్ డాలర్లే. కానీ ఏప్రిల్-జూన్, జూలై-సెప్టెంబర్ త్రైమాసికాల్లో క్షీణత ప్రభావితం చేసినట్టు తాజా ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అధిక వడ్డీరేట్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఎఫ్‌డీఐ పతనానికి కారణమేనన్న అభిప్రాయాలు ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ 22 శాతం పడిపోయి 46 బిలియన్ డాలర్లుగానే ఉన్న విషయం తెలిసిందే.

ఆయా రంగాల్లో..

కంప్యూటర్ హార్డ్‌వేర్-సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, సేవలు, టెలికం, ఆటో, ఔషధ, రసాయన రంగాల్లో ఎఫ్‌డీఐలు దిగజారినట్టు తేలింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి, విద్యుత్తు రంగాల్లోకి ఎఫ్‌డీఐ పెరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే క్షీణత నమోదైనట్టు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) చెప్తున్నది. ఇదిలావుంటే నిరుడు ఏప్రిల్-డిసెంబర్‌లో ఈక్విటీ మార్కెట్లు, ఇతరత్రా పెట్టుబడులు కలుపుకొని దేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐని పరిగణనలోకి తీసుకుంటే 51.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 ఏప్రిల్-డిసెంబర్‌తో పోల్చితే దాదాపు 7 శాతం తగ్గాయి. నాడు 55.27 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

ఆయా దేశాల నుంచి..

గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్‌లో భారత్‌లోకి సింగపూర్ నుంచి వచ్చిన ఎఫ్‌డీఐలు పడిపోయాయి. అమెరికా, బ్రిటన్, సైప్రస్, యూఏఈ దేశాల నుంచి తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా కేమన్ ఐస్‌లాండ్స్ నుంచి ఎఫ్‌డీఐలు 215 మిలియన్ డాలర్ల వద్దే ఉండగా, సైప్రస్ నుంచి వచ్చినవి 796 మిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. నిజానికి 2022 ఏప్రిల్-డిసెంబర్‌లో భారత్‌కు కేమన్ ఐస్‌లాండ్స్ నుంచి 624 మిలియన్ డాలర్లు, సైప్రస్ నుంచి 1.15 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. అయితే మారిషస్, నెదర్లాండ్స్, జపాన్, జర్మనీ నుంచి ఎఫ్‌డీఐ రాక పెరిగింది.

తెలంగాణకు పెరిగాయ్..

2023 ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో ఆయా దేశాల నుంచి తెలంగాణకు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2022 ఇదే వ్యవధితో పోల్చితే పెరిగినట్టు తాజా గణాంకాల్లో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. గుజరాత్, జార్ఖండ్ రాష్ట్రాలకూ ఎఫ్‌డీఐలు చెప్పుకోదగ్గ రీతిలోనే వచ్చాయన్నది. అయితే రాష్ట్రాలవారీగా మహారాష్ట్రలోకి అత్యధికంగా 12.1 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. మునుపు 10.76 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ గతంతో పోల్చితే కర్ణాటకకు 8.77 బిలియన్ డాలర్ల నుంచి 3.6 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఢిల్లీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలూ ఎఫ్‌డీఐలను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.

పరిశ్రమలతోనే సుసంపన్నం

- **పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు**
- **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి**
- **సింగపూర్ బృందంతో భేటీ**
- **పెట్టుబడులకు సహకరిస్తామని వెల్లడి**

గురువారం సచివాలయంలో బీఈఎంఎల్ సీఎండీ శంతను రాయ్‌తో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్రంలో సింగపూర్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆయన రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ బృందంతో సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని వర్గాలకు అనుకూలమైన భౌగోళిక వాతావరణం, ప్రభుత్వ స్నేహపూర్వక విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలున్నాయని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణంతో హైదరాబాద్‌లో పెట్టుబడులు పెరిగాయన్నారు. తాజాగా రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం చేపట్టడం తోపాటు రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి క్లస్టర్ జోన్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇటీవల జపాన్‌కు చెందిన జైకా.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపినట్టు గుర్తుచేశారు.

పెట్టుబడులు పెడుతాం: పాంగ్

సింగపూర్‌కు చెందిన పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని అంతకుముందు ఆ దేశ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తెలిపారు. అర్బన్ ప్లానింగ్ విషయంలో తమకు మంచి పట్టు ఉందని కూడా తెలియజేశారు. సింగపూర్‌కు చెందిన అతిపెద్ద బ్యాంక్ డీబీఎస్.. హైదరాబాద్‌లో పనిచేస్తున్నదన్న ఆయన.. ఇక్కడి ఐటీ పార్కులోనూ తమ దేశ ఆఫీసులున్న విషయాన్ని గుర్తుచేశారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, బయోటెక్ హబ్‌గా స్థిరపడుతున్నదని పేర్కొంటూ.. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుంటామని స్పష్టం చేశారు.

భట్టితో బీఈఎంఎల్ సీఎండీ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సచివాలయంలో భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) కంపెనీ సీఎండీ శంతను రాయ్ తమ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ కంపెనీ కార్యకలాపాల గురించి రాయ్ వివరించారు. మెట్రో రైల్ కోచ్‌ల తయారీ, రక్షణ, మైన్స్ వంటి రంగాల్లో తమ సంస్థ పని చేస్తున్నదని చెప్పారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున తాము రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. దీంతో మెట్రో కోచ్‌ల తయారీలో బీఈఎంఎల్‌కున్న అనుభవాన్ని, వారి ఉత్పత్తుల నాణ్యతను గురించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్రంలో మెట్రో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెడితే అందుకు అవసరమైన భూమిని కేటాయించడంతో పాటు అన్నిరకాలుగా సహకరిస్తామని సదరు సంస్థకు భరోసా ఇచ్చారు.

నష్టాల నుంచి లాభాల్లోకి..

ముంబై, ఫిబ్రవరి 29: తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు చివర్లో లాభాల్లోకి వచ్చాయి. డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా నష్టాల్లో ప్రారంభమైన సూచీలు సమయం గడుస్తున్నకొద్ది భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో 72 వేల దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 195 పాయింట్లు పెరిగి 72,500 వద్ద ముగిశాయి. గురువారం సెన్సెక్స్ 72,730 స్థాయి నుంచి 72,099 పాయింట్ల స్థాయిలో కదలాడింది. మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు లాభాల్లోకి రావడానికి దోహదం చేశాయి. బ్లూచిప్ సంస్థల షేర్ల పతనం కొనసాగుతుండటం, డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. మరో సూచీ నిఫ్టీ 31.65 పాయింట్లు ఎగబాకి 21,982.80 పాయింట్ల వద్ద ముగిసింది.

- ఇండస్‌ఇండ్ బ్యాంక్ రెండు శాతం వరకు పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లె, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, మారుతి, టైటాన్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు ఒక్క శాతానికి పైగా బల పడ్డాయి.
- ఎస్బీఐ, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, విప్రో, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా మోటర్స్, టెక్ మహీంద్రా, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.

కొహెన్స్ లైఫ్‌తో సువెన్ ఫార్మా విలీనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: సువెన్ ఫార్మాస్యూటికల్స్..కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (సీడీఎంఓ) ప్లాట్‌ఫామ్ కొహెన్స్ లైఫ్ సైన్సెస్‌తో విలీనం కానుంది. సువెన్ ఈ మేరకు గురువారం సమాచారం అందించింది. విలీన స్కీమ్‌లో భాగంగా కొహెన్స్ షేర్‌హోల్డర్లకు ప్రతీ 295 షేర్లకు 11 సువెన్ షేర్లను జారీచేస్తారు. జారీకాబోయే సువెన్ ఫార్మా కొత్త షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో ట్రేడవుతాయని కంపెనీ తెలిపింది. ఈ లావాదేవీ షేర్‌హోల్డర్లు, సంబంధిత రెగ్యులేటరీ అనుమతులకు లోబడి వచ్చే 12-15 నెలల్లో పూర్తవుతుంది. సువెన్‌ను ప్రమోట్ చేసిన జాస్తి కుటుంబం కంపెనీల్లో తమ 50.1 శాతం వాటాను 2022 డిసెంబర్‌లో గ్లోబల్ పీఈ ఫండ్ అడ్వంట్ ఇంటర్నేషనల్‌కు విక్రయించారు.

ఇక ధరల మోతే!

రిలయన్స్-డిస్నీ విలీనంపై నిపుణుల మాట

గుత్తాధిపత్యంతో టారిఫ్‌లు పెరుగుతాయన్న అంచనాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: భారతీయ మీడియా, వినోద రంగంపై రిలయన్స్-డిస్నీ విలీనం పెద్ద ఎత్తునే ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ వయకామ్18తో వాల్ట్ డిస్నీ దేశీయ మీడియా వ్యాపార కార్యకలాపాలు ఏకమవుతున్న విషయం తెలిసిందే. ఇదే జరిగితే దేశీయ మీడియా, వినోద రంగంలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతుందని, ఫలితంగా సబ్‌స్క్రైబర్లకు ఇప్పటిదాకా అందుతున్న తక్కువ చార్జీల ప్రయోజనాలు క్రమేణా దూరం కాగలవని ఈ రంగ నిపుణులు అంటున్నారు. వ్యాపారులు సైతం తమ వాణిజ్య ప్రకటనల కోసం బేరాలాడే శక్తిని కోల్పోవచ్చని, దీనివల్ల ప్రకటనల వ్యయం పెరిగి వినియోగదారులపై ఆ భారం పడవచ్చని చెప్తున్నారు. రిలయన్స్-డిస్నీ దేశీయ మీడియా కార్యకలాపాల విలీనంతో రూ.70,000 కోట్ల కొత్త సంస్థ ఆవిర్భవించనున్నది. వచ్చే ఏడాది మార్చికల్లా కావాల్సిన అనుమతులు వస్తాయని అంచనా. ఇక ఇందులో ఓటీటీ మార్కెట్ బడా వేదికలైన జియో సినిమా, డిస్నీప్లస్‌హాట్‌స్టార్‌లతోపాటు స్టార్ గ్రూప్‌నకు చెందిన అన్ని చానళ్లు, టీవీ18 ఆధ్వర్యంలోని చానళ్లు ఉండనున్నాయి. మొత్తంగా 120 చానళ్లు, 2 ఓటీటీలు, రిలయన్స్, డిస్నీలకు చెందిన 2 ఫిల్మ్ స్టూడియోలు ఒకే సంస్థ పరిధిలోకి రానున్నాయి. దీంతో మార్కెట్‌లో పోటీ వాతావరణం తగ్గిపోతుందని, మెజారిటీ టెలివిజన్ చానళ్లు ఒక్కరివే అయితే వారు నిర్ణయించిన ధరలకే చానళ్లను సబ్‌స్క్రైబర్లు కొనుక్కోవాల్సి వస్తుందని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. వీటిల్లో యాడ్స్ ఇవ్వాలన్నా వ్యాపారులు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని, చివరకు ఇది ఆయా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారి తీయవచ్చన్న ఆందో